132

# 23. మీ ధోరణి మీదేనా?

'తమరు కోప్పడనంటే రెండు ముక్కలు చెవిన వేసి పోదామని వచ్చాను' అంటూ సీతాపతి వచ్చి కూచున్నాడు. అలాంటి ధోరణి అంటే నాకు పడదు. ఎలాగూ వచ్చాడు కదా అని ఏమిటన్నట్టు కళ్ళెగరేశాను.

"మరేం లేదు. నిర్మాణాత్మక రచనలు అట్టే రావడం లేదిప్పుడు. తమరు చిత్తగించారో లేదో... ఉన్నదున్నట్లు చెప్పగల సాహసం మనవాళ్ళలో క్రమక్రమంగా తగ్గిపోతోంది. అలాంటప్పుడు చూపించింది చూసినట్టు రాయగల గుండె ధైర్యం మనలో ఎంతమందికుంటుంది?"

మరింత చికాకుగా అతని వేపు చూశాను. నన్నేం అతను లక్ష్యపెట్టినట్టు లేదు. తన ధోరణి కొనసాగించాడు.

'తమరు గుర్తించే ఉంటారు. నేను ఎంతమందికో విరోధిని అయిపోయాను. నా మనసులో మాట కుండబద్దలు కొట్టునట్టు మొహం మీద అనెయ్యడం వల్లనే. నా మాటలకీ, నా కథలలో కనబడే నా అభిప్రాయానికి ఏ మాత్రం తేడా లేదు. మాట అనేది గాలికి ఎగిరిపోవచ్చు గాని రాత అనేది అచ్చు అక్షర రూపంలో శాశ్వతంగా ఉండిపోతుంది కదా! రచయిత నిజాయితీ అంటే ఇదే అని నేను నమ్ముతున్నాను. తమరు చెయ్యి తిరిగిన రచయితలు, మీ అభిప్రాయం చెప్పమని మనవి..."

అన్నాడు గాని ఇంకొకరి అభిప్రాయం తెలుసుకునే ఓర్పు సీతాపతిలో మిగిలి ఉందని నేను అనుకోలేదు. ఎందుకంటే అక్కడితో ఆగకుండా అతనలా కొనసాగిస్తూనే ఉన్నాడు...

'ఇంతకీ తమరి అభిప్రాయం మాత్రం మరొకలా ఎందుకుంటుందిలెండి....'

మా ఇద్దరి మధ్య ఉన్న టేబిలు మీద రెండుచేతులూ ఆనించి తల వాల్చుకొని కూచున్నాడు సీతాపతి. కళ్ళు కూడా మూసేసుకొని కాళ్ళు ఆడిస్తూ శ్రోత దొరికిన ఉత్సాహంతో అలా అల్లుకుపోతుంటే ఇంటికొచ్చిన పెద్దమనిషిని ఏమంటూ ఎలా వెంటబెట్టాలో నాకు అంతుపట్టలేదు.

ఆపద్బాంధవుల్లా మా యింటి పక్క వాటాలో దిగిన కొత్తజంట అప్పుడే నన్ను చూడ్డానికి వచ్చి, ఆదుకున్నారు. రమేశం, జానకీ 'నాటెటాల్ మేడ్‌ఫర్ ఈచ్ అదర్' అన్నట్టు ఉంటారు. ఎందుకంటే ఆవిడ మరీ సన్నంగా ఉఫ్ అంటే ఎగిరిపోయేలా ఉంటుంది. కాస్త తక్కువేమో అనిపిస్తాడు గాని రమేశం ఆమెకంటే పొడవులో ఓ అరించి ఎక్కువగానే ఉంటాడు. ఆ వయసుకి ఆ ఒళ్ళూ ఎక్కువే. పైగా దూరం నుంచి చూస్తే మీసం కూడా కలిసిపోయేటంత కారు నలుపు. మొట్టమొదట వీళ్ళని చూసినప్పుడు ఇద్దరి మీదా ఏకకాలంలో జాలి కలుగక తప్పదు. కాని అయిదు నిమిషాలు వీళ్ళతో గడిపితే మన తప్పుడు అంచనాకి మనమీద మనకే జాలికలిగేలా ప్రవర్తిస్తారు. ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్ళిద్దరికీ ఒకరి మీద ఒకరికి ఎంతటి ఆరాధనో తెలుసుకుంటే మబ్బు విడిచిన చందమామ తొంగి చూసినట్టు. 'రమేశం గారికి, అభినందనలతో' అని నా రచన ఒకటి సంతకం పెట్టి ఇచ్చిన నాడు

అతని అభ్యర్థన జన్మలో మరచిపోలేను. 'మూర్తిగారూ, నేనే కాదు, మా జానకి కూడా మీ కథలంటే చెవి కోసుకుంటుంది. సాహిత్యంలోనే కాదు మరే లలితకళలో అయినా సరే మా జానకి నాకంటే కాస్త ముందుంటుంది. ఇన్నాళ్ళకి మా అభిమాన రచయిత ఆటోగ్రాఫ్ చేసి యిచ్చిన నవల లభించడం మా అదృష్టం. మీరు నా పేరు రాశారు. చూడండి, దాని మీద కొంచెం ఖాళీ ఉంది. అదే చేత్తో 'జానకి గారికి' అని రెండు ముక్కలు రాసివ్వరూ, ప్లీజ్ ఏదైనా కలసి పంచుకోవడం మాకు సరదా అండీ' కొండలాంటి మనిషిలో అంతటి తియ్యటి కోనేరు ఉండగలదని ఊహించలేకపోయాను. వెంటనే రాసి యిచ్చాను. ఆ రాత్రే డైరీలో నోట్ చేసుకున్నాను. పాఠకులను చూసి రచయితలు నేర్చుకోవలసింది చాలా ఉందని, 'ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు గనుక ఎప్పుడైనా తీరికగా ఓ శలవనాడు రండి' అనే నా ఆహ్వానం మన్నించడానికి ఈ గుడ్‌ఫ్రైడే నాడు తప్ప వాళ్ళకి కుదిరి ఉండదు.

గోడకి చేర్చిన రెండు మడతకుర్చీలూ వాల్చి వారిద్దర్నీ సాదరంగా ఆహ్వానించాను. సాటి రచయితగా సీతాపతిని వారికి పరిచయం చేశాను. సీతాపతి వెంటనే అందుకున్నాడు, జానకిని చూస్తూ.

'నేను ప్రపంచం అంతా చూసినవాణ్ణి, పెద్దవాణ్ణి. గురువుగారంత పేరుప్రఖ్యాతులు లేవు గానీ ఏవో ఓ పాతిక ముప్ఫయి కథలు నావీ అచ్చు అయ్యాయి. గొప్ప కోసం కాదు. నా పరిశీలనాశక్తి మీరు అర్థం చేసుకుంటారని, మిమ్మల్ని ఈయన పక్కన చూస్తే నాకేమనిపించిందో చెప్పనా?'

'మరేముంది, కాకి ముక్కుకి దొండపండు' అనిపించి ఉంటుంది. అవునా?' అన్నాడు రమేశం నవ్వుతూ, ఆ మాటలకి జానకి కూడా తేలిగ్గా నవ్వగలగడం నాకెంతో హాయి అనిపించింది.

'ఆ మాట మామూలుగా అందరూ అనే డొంకతిరుగుడు మాట. సూటిగా ఆలోచించ గల మా రైటర్సుకి స్ఫురించే నగ్నసత్యం వేరు. మీ ఆకారాలిచ్చే ఇంప్రెషన్స్‌ని బట్టి ఎవరికైనా వెంటనే అనిపించేది ఒకటే. మీకు ఆవిడ రెండోపెళ్ళి పెళ్ళాం అయి ఉంటుందని! నా మాట రైటేనా?!!'

సీతాపతి చేసిన ఆ రిమార్కు చెవుల సోకగానే అప్పటివరకూ కళకళలాడుతున్న ఆ రెండు ముఖాలూ ఉన్నట్టుండి ముడుచుకుపోయినట్టయింది. అప్పటికీ పొడినవ్వు లాంటిది ఒకటి తెచ్చుకొని, పులుముకున్న నీలినీడల్ని తరిమికొడదామనే ప్రయత్నం వాళ్ళ మొహాల మీద కనబడుతూనే ఉంది. సీతాపతి అప్పటికీ సంతృప్తిపడినట్టు లేదు.

'ఇలాంటివి మీరింత తేలికగా తీసుకుంటే లాభం లేదండోయ్ రమేశంగారూ, మీరేదో ఒకటి చెయ్యాలి. నాలా అందరూ కలగజేసుకొని చెప్పరు గనక పైకి కనబడే రూపురేఖలు మిమ్మల్నంత ఇబ్బంది పెట్టవు. ముప్ఫయి ఏళ్ళు రాకుండానే బొజ్జ పెంచుకుంటూ పోతే శరీర ధర్మాల బ్యాలన్సు తప్పి, షుగరూ, బీపీ లాంటివి బైతాయించి పీల్చి పిప్పి చెయ్యగలవు, ఏమనుకున్నారో ఏమో!'

'మీరాయన్ని అలా భయపెట్టలేరండోయ్. అదేం శరీరమనుకున్నారేమో, ఉక్కుముక్క! ఎప్పుడేం తిన్నా, తిన్న అరగంటకి కరకర ఆకలేసే అదృష్టం ఎంతమందికుంటుందిలెండి' అని జానకి

సర్దబోతే ఆయన ఒప్పుకుంటాడా!

'అంత మంచి ఆరోగ్యం కనకనే ఎల్లకాలం నిలబడగలదనే ధీమాతో అశ్రద్ధ చేసుకుంటారు. ఎక్కడ లావయిపోతానో అని పిట్టతిండి తినే మీలాంటి వాళ్ళకి ఏ క్షయో ఎంత సులువుగా అంటుకుంటుందో మితిమీరి భోంచేసే మీ పెనిమిటి లాంటి వాళ్ళని డయబెటిస్ పీడించడమూ అంత సహజం. ఓ పూట పస్తుండి అయినా ఆయన మీకు రెట్టింపు క్యాలరీలు అందించడం అత్యవసరం. అంచేత నే చెప్పేది ఏమిటంటే....'

సీతాపతి అలా ఏదో కొనసాగిస్తూనే ఉన్నాడు.... 'తర్వాత వచ్చి కలుసుకుంటాం' అన్నట్టు నాకు సంజ్ఞ చేసి వాళ్ళిద్దరూ చల్లగా ఉడాయించారు. నేనూ పనుందని లోపలికి తప్పుకున్నాను. కాసేపటికి ఏదో గొణుక్కుంటూ సీతాపతి బయటికి జారుకోవడం చూసి తలుపేసుకున్నా గాని నా ప్రాణం తెప్పిరిల్లలేదు. కళ్ళు మూసుకొని అక్కడ పడక్కుర్చీలో జారపడ్డాను. ఆ చిన్న సంఘటనే సున్నితమైన నా మనసుని ఓ ఊపు ఊపేసింది.

సీతాపతి ఇదే మొదటిసారి వాళ్ళని కలుసుకోవడం. వాళ్ళిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళు. పరస్పరం ప్రేమా, అవగాహనా కలవాళ్ళు. ఏదో చుట్టపుచూపుగా వచ్చారు. అదైనా తనకోసం కాదు. అయినా తనమట్టుకు తనే పెద్దరికం కల్పించుకుని, తన అభిప్రాయం కోసం అవతలి వాళ్ళు వీసమెత్తు ఆతృతయినా చూపించకపోయినా తనలో అదివరకే తిష్ఠ వేసుకు కూచున్న అభిప్రాయాలను వాళ్ళ మీద రుద్దడం ఏం న్యాయం! ప్రతీక్షణం విలువలు మారిపోతూ, నిత్య పరిణామశీలం గల నేటి సంఘంలో ఏవో కొన్ని సూత్రాల పేరుతో జనరలైజ్ చేసి హింసించడం ఏం ధర్మం?!

ఇవన్నీ మాటమాత్రంగానైనా ఎత్తిపెట్టి సీతాపతిని ఎందుకు ఎదుర్కోలేకపోయానా అనిపించింది. ఇదే దారి అని చెప్పడం ఎలాంటిదో ఇది ఎంతమాత్రం దారి కాదు అని వాదించడమూ మొండితనమే అవుతుంది. 'మమ్మల్ని సీతాపతి బారినుండి రక్షించండి' అంటూ వాళ్ళేం నాకు మొరపెట్టుకోలేదు. అనవసరం జోక్యం ఎంత తప్పో, లేనిపోని తాపత్రయమూ అంతటిదే. తామరాకు మీద నీటిబిందువుగా ఉండలేకపోతే మనిషి ఏ కళలోనూ రాణించలేడేమో!

★